క్లుప్తంగా

బలరామావతారంలో జగన్నాథుడు



బలరామావతారంలో దర్శనమిస్తున్న జగన్నాథుడు

మునగపాక : మునగపాక, నాగులాపల్లి గ్రామాల్లోని జగన్నాథుడు మంగళవారం బలరామావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం నుంచి జగన్నాథుని దర్శించుకునేందుకు సమీప ప్రజలు తరలివచ్చారు. ఈ నెల 29న జగన్నాథుని పండగను ఘనంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

3న పీడీఎస్ బియ్యం వేలం

పాయకరావుపేట : వివిధ కేసుల్లో పట్టుబడి 6ఏ కేసులు నమోదు చేసిన సీజ్ చేసిన పీడీఎస్ బియ్యం 183.75 క్వింటాళ్ల బియ్యం జూలై 3న వేలం వేయడం జరుగుతుందని మండల తహసీల్దార్ కె.జయప్రకాష్ ఒక ప్రకటనలో తెలిపారు. 3న పట్టణంలో గల ఎంఎల్ఎస్ పాయింట్ వద్ద బియ్యం వేలం నిర్వహించడం జరుగుతుందన్నారు. పూర్తి వివరాల కోసం మండల తహసీల్దార్ కార్యాలయం, మండల పరిషత్ కార్యాలయంలో కూడా నోటీసులు బోర్డులు ప్రదర్శించడం జరిగిందన్నారు. ఏ మండలం వారైనా సరే వేలంలో పాల్గొనవచ్చునని తహసీల్దార్ ఆ ప్రకటనలో తెలిపారు.

ఆలయ అర్చకుడికి ఆర్థిక సాయం



పోలాజీరావు భార్య కళావతికి రూ.10 వేలు అందజేస్తున్న ఈవో మూర్తి

మునగపాక : టి.సిరసపల్లి వీరభద్రస్వామి ఆలయ అర్చకుడు అప్పికొండ పోలాజీరావు భార్య కళావతికి మంగళవారం ఈవో పి.ఎస్.ఎన్ మూర్తి రూ.10వేల సాయం అందజేశారు. ఆలయ అర్చకులు పోలాజీరావు ఇటీవల మేడపై నుంచి జారిపడి మృతి చెందిన విషయం తెలిసిందే. బాధిత కుటుంబానికి దహన సంస్కారాల నిమిత్తం ఈ సాయం అందజేసినట్లు మూర్తి తెలిపారు.

కైలాసపట్నంలో 'గడప గడపకు' నేడు

కోటవురట్ల : కైలాసపట్నంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం బుధవారం నిర్వహించనున్నట్టు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి ఆర్.ఎస్.సీతారామరాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గొల్ల బాబూరావు ఇంటింటికీ వెళ్లి సమస్యలు తెలుసుకుంటారని తెలిపారు. ఉదయం 6 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని అధికారులు, ప్రజా ప్రతినిధులు, వలంటీర్లు హాజరు కావాలని సూచించారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి



అరబుపాలెం ఆర్‌బీకే పనులను పరిశీలిస్తున్న అధికారులు

మునగపాక : మండలంలోని అరబుపాలెం ఆర్‌బీకే పనులను మంగళవారం ఇంజినీరింగ్ అధికారులు పరిశీలించారు. పంచాయతీ రాజ్ ఈఈ నగేష్‌బాబు, మండల అధికారి చంద్రశేఖర్ కలిసి నిర్మాణంలో ఉన్న ఆర్‌బీకే పనులను పరిశీలించారు. నాణ్యతతో కూడిన పనులు జరగాలన్నారు. భవన నిర్మాణ పనులు వేగవంతమయ్యేలా చూడాలని ఆదేశించారు. సర్పంచ్ బొడ్డేడ శ్రీనివాసరావు,ఎంపీటీసీ బొడ్డేడ బుజ్జి పాల్గొన్నారు.

'టీడీపీ విజయానికి కృషి'

మునగపాక : రానున్న సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ విజయమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పాటు పడాలని ఆ పార్టీ నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు పెంటకోట విజయ్ పిలుపునిచ్చారు. మునగపాకలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. చంద్రబాబు సీఎం కావడం ద్వారా అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. సమావేశంలో పార్టీ నేతలు ముసిలినాయుడు, శ్రీనివాసరావు, నరసింగరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటా సంతోషం వెల్లి విరియాలనే..



కె.వెంకటాపురంలో సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే బాబూరావు

కోటవురట్ల : ప్రతి ఇంటా సంతోషం వెల్లి విరియాలనే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాలను అందిస్తున్నారని ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. కె.వెంకటాపురంలో రెండో రోజు మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. తొలుత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు పైల రమేష్ ఆధ్వర్యంలో ఎస్సీ కాలనీ, రామాలయం వీధి, శివారు గ్రామం బోను కొత్తూరులో ఇంటింటికీ వెళ్లి సమస్యలపై ఆరా తీసి సంక్షేమ పథకాల లబ్ధిని వారికి వివరించారు. ఎస్సీ కాలనీలో రూ.12 లక్షలతో నిర్మించిన అంగన్‌వాడీ కేంద్రం భవనాన్ని ప్రారంభించారు. ఎస్సీ కాలనీలో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని కోరారు. బోను కొత్తూరులో డ్రైనేజీలు ఏర్పాటు చేయాలని, కొత్తగా ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. ఇందుకు సంబంధించి సంబంధిత అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఆదేశించారు. ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలను అందిస్తూనే అవినీతి రహిత సమాజ కోసం గ్రామ సచివాలయ వ్యవస్థను ప్రవేశపెట్టారన్నారు. సంక్షేమ పథకాలను పారదర్శకంగా అందిస్తూ నిధులను నేరుగా లబ్ధిదారుల అకౌంట్లలో జమచేస్తున్నారన్నారు. చిన్నారులకు బంగారు భవితను అందించడమే కాకుండా వారి చదువుకు ఇబ్బంది లేకుండా తల్లుల అకౌంట్లలో నగదు జమ చేస్తున్నారన్నారు. ఆర్‌బీకేల ద్వారా రైతు ముంగిటకే సమస్త సేవలు అందుతున్నాయన్నారు. నాణ్యమైన విత్తనాలు, ఎరువుల సరఫరా సకాలంలో జరుగుతోందన్నారు. వైద్య సేవలు కూడా ప్రజల ముంగిటకే చేరుతున్నాయని, ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంతో రోగుల ఇళ్లకు వెళ్లి వైద్య సేవలు అందిస్తున్నారన్నారు. అవ్వా తాతలకు ఒకటో తేదీనే నేరుగా వారి ఇంటికే పింఛను అందుతోందన్నారు. రానున్న ఎన్నికలల్లో అత్యధిక మెజారిటీతో వైఎస్సార్‌సీపీని గెలిపించాలని కోరారు. మీ అందరి ఆశీస్సులు జగన్‌కు అందించి సీఎంను చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు పైల శ్రీదేవి మంగా ఇందిర భవానీ, కోసూరు అప్పారావు, శివరామ్, గోపాలకృష్ణ, ఎంపీటీసీలు రత్నం, రాంబాబు, పార్టీ నాయకులు నారాయణమూర్తిరాజు, చిట్టిబాబు, పైల నాని, రమణమూర్తి, సత్యనారాయణ, సత్యవతి, శ్రీరామ్మూర్తి, శెట్టి రమణ, చీకట్ల వెంకట్, మాజీ జెడ్పీటీసీ నీలేంద్రరావు, తహసీల్దారు జానకమ్మ, ఎంపీడీవో కాశీ విశ్వనాథరావు, ఏవో చంద్రశేఖర్, డీటీ సోమశేఖర్, హౌసింగ్ ఏఈ జగదీశ్వరరావు, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ కరుణ, పీఆర్ జేఈ వర్మ, సీఐ నారాయణరావు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గొల్ల బాబూరావు

ఎస్.రాయవరం : జగనన్న సురక్ష కార్యక్రమం విజయవంతం చేయడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు సూచించారు. కొరుప్రోలు క్యాంపు కార్యాలయం వద్ద మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించి అధికారులకు దిశా నిర్దేశం చేశారు. జగనన్న సురక్ష పథకంతో గ్రామాల్లో అన్ని సమస్యలకు పరిష్కారం దొరుకుతుందన్నారు. గ్రామ వలంటీర్లు, సచివాలయ సిబ్బంది నిర్వహించే క్యాంపుల్లో గృహసారథులు, కన్వీనర్లు, పార్టీ నాయకులు పర్యటించాలన్నారు. క్యాంపుల్లో టోకెన్లు అందజేసి అవసరమైన వారికి 11 రకాల ప్రభుత్వ సేవలు నిర్దేశించిన సమయంలో ఉచితంగా అందజేస్తున్నట్టు చెప్పాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ మండలి చైర్మన్ చిక్కాల రామారావు, నక్కపల్లి, ఎస్.రాయవరం ఎంపీపీలు రత్నం, లోవలక్ష్మి, పాయకరావుపేట, నక్కపల్లి జెడ్పీటీసీలు సూరిబాబు, కాసులమ్మ, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి సీతారామరాజు, ఎస్.రాయవరం, నక్కపల్లి తహసీల్దార్లు విజయ్‌కుమార్, అంబేద్కర్‌లు, ఎస్.రాయవరం, పాయకరావుపేట తహసీల్దార్ రామచంద్రమూర్తి, సాంబశివరావు, సర్పంచ్‌లు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

నాగులాపల్లి వలంటీర్ల వితరణ

దేవాలయాల అభివృద్ధికి రూ.37వేల విరాళం



దేవాలయాల అభివృద్ధికి తమవంతు సాయం అందజేస్తున్న నాగులాపల్లి వలంటీర్లు

మునగపాక : మండలంలోని నాగులాపల్లి వలంటీర్లు తమ ఔదార్యాన్ని చాటుకున్నారు. ఒకవైపు సంక్షేమ పథకాలు సక్రమంగా అందించడంలో పేరుగాంచిన వలంటీర్లు తమ వంతు సాయంగా గ్రామంలోని దేవాలయాల అభివృద్ధికి ముందుకొచ్చారు. 37 మంది వలంటీర్లు ఒక్కొక్కరు వెయ్యి వంతున రూ.37 వేల విరాళాన్ని గ్రామపెద్దలకు అందజేశారు. శ్రీ సీతారామ, వేంకటేశ్వర స్వామి, జగన్నాథుని ఆలయాల అభివృద్ధిలో భాగంగా తాము భాగస్వాములం కావడం సంతోషంగా ఉందని పలువురు వలంటీర్లు తెలిపారు.

కార్మిక సమస్యల పరిష్కారానికి యాజమాన్యం చొరవ చూపాలి



సిబ్బందికి సూచనలు ఇస్తున్న కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ సునీత

అచ్యుతాపురం(అనకాపల్లి): బ్రాండిక్స్‌ను కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ సునీత మంగళవారం సందర్శించారు. బ్రాండిక్స్ కార్యాలయంలోని సిబ్బందితో మాట్లాడి, కార్మిక శాఖ నియమాలు, అమలు గురించి ఆరా తీశారు. కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు యాజమాన్యం చొరవ చూపాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులకు అందించే పథకాలు అందేలా కార్మిక శాఖ కృషి చేస్తుందని తెలిపారు. క్లిష్టమైన పనులు చేసే కార్మికులు విధుల్లో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, సీజన్‌ల వారీగా ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. అన్ని కర్మాగారాలను తనిఖీ చేస్తున్నామని తెలిపారు.

పోలవరం పాలికేకకు బాసటగా నిధి సేకరణ



నిధి వసూళ్లు చేపడుతున్న దృశ్యం

అచ్యుతాపురం (అనకాపల్లి): పోలవరం ప్రాజెక్టు నిర్మాణం కోసం త్యాగం చేసిన నిర్వాసితుల కోసం చేపడుతున్న పోలవరం పాలికేకకు సంఘీబావంగా అచ్యుతాపురం మండలంలో మంగళవారం నిధి వసూళ్ల కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం కార్యదర్శి వర్గ సభ్యుడు కోటేశ్వరరావు మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు వల్ల భూములు కోల్పోతున్న వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆర్.రాము, కర్రి అప్పారావు, కృష్ణ, కె.సోమునాయుడు పాల్గొన్నారు.

నిర్లక్ష్యం వహించవద్దు




జగనన్న సురక్షపై సమీక్షిస్తున్న ఎంపీడీవో, అధికారులు

కోటవురట్ల : జగనన్న సురక్ష సర్వేను సకాలంలో పూర్తి చేయాలని, షెడ్యూల్ ప్రకారం కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి అధికారులు కృషి చేయాలని ఎంపీడీవో కాశీ విశ్వనాథరావు కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లతో మంగళవారం సమావేశం నిర్వహించి జగనన్న సురక్ష కార్యక్రమంపై చర్చించారు. ప్రతి దరఖాస్తుకు టోకెన్ జనరేట్ చేయాలన్నారు. ఏయే సర్వీసుల కోసం దరఖాస్తులు వచ్చాయో వివరాలు నమోదు చేయాలన్నారు. కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుందని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో చంద్రశేఖర్, కార్యదర్శి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

చెరువుల్లో అక్రమ మట్టి తవ్వకాలు

- ప్రభుత్వ ఖజానాకు గండి
- ఆయకట్టు రైతుల ఆందోళన



నెల్లిపూడి సమీపంలో చెరువులో మట్టిని అక్రమంగా నిల్వచేసిన దృశ్యం

నక్కపల్లి : మండలంలో నెల్లిపూడి సమీపంలో ఉన్న ఊర చెరువులో కొద్ది రోజుల నుంచి కొంతమంది అక్రమార్కులు నిబంధనలకు విరుద్ధంగా మట్టిని ప్రతిరోజూ పొక్లెయిన్‌ల సాయంతో తవ్వేసి సమీపంలో పెద్ద పెద్ద గుట్టలుగా పోసి విక్రయిస్తున్నారు. ఇటుక బట్టీల వారికి విక్రయించి లక్షలాది రూపాయలు ఆర్జిస్తూ ప్రభుత్వ ఖజానాకు గండికొడుతున్నారు. ఈ చెరువుల కింద భూములు కలిగి సాగు చేసుకుంటున్న రైతులు, పశువులను నీటి కోసం తీసుకెళ్లే పాడి రైతులు మట్టి తవ్వకాల వల్ల ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చెరువులను 50 నుంచి 50 అడుగుల లోతున తవ్వేయడం వల్ల వర్షాకాలంలో చెరువుల్లోకి చేరిన నీరు ఆయకట్టు భూములకు ఉపయోగించుకునే పరిస్థితి ఉండదని, పశువులు నీటి కోసం చెరువులో దిగితే మునిగిపోయి మృత్యువాత పడే ప్రమాదం ఉందంటూ పాడిరైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మట్టిని తవ్వాలంటే రెవెన్యూ అధికారుల నుంచి నో అబ్జెక్షన్ ధ్రువ పత్రం తీసుకుని మైనింగ్ శాఖవారికి దరఖాస్తు చేసి నిర్ణయించిన ఫీజు చెల్లించి మట్టిని నిబంధనల మేరకు రెవెన్యూ, ఇరిగేషన్, మైనింగ్ అధికారులు సంయుక్తంగా పరిశీలన చేసి, వారిచ్చిన కొలతలకు లోబడి మట్టిని తవ్వవలసి ఉంటుంది. కానీ అక్రమార్కులు అడ్డగోలుగా తవ్వకాలు జరిపిన మట్టిని ప్రైవేటు రియల్టర్లు వేసిన లేఅవుట్లలో ప్లాట్లను చదును చేసేందుకు, ఇటుక బట్టి వ్యాపారులకు లారీ లోడు రూ.5వేల చొప్పున విక్రయిస్తున్నారు. నెల్లిపూడి, చెరువు గోపాలపట్నం ఆవ ప్రాంతాల్లో నుంచి ఇలా ప్రతి రోజు వందలాది లారీల్లో మట్టిని తరలిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. నెల్లిపూడి, వేంపాడు తదితర గ్రామాల్లో ఇటీవల కాలంలో పదుల సంఖ్యలో లేఅవుట్లు ఏర్పాటవుతున్నాయి. 15 వరకు ఇటుక బట్టీలు ఏర్పాటు చేశారు. నెల్లిపూడి సమీపంలో వేలాది క్యూబిక్ మీటర్ల మట్టిని గుట్టలుగా నిల్వ చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్రమ మట్టి తవ్వకాలపై దాడులు నిర్వహించి నిల్వ చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. దీనిపై తహసీల్దార్ అంబేద్కర్‌ను వివరణ కోరగా మట్టి తవ్వకాల విషయం ఇప్పుడు తన దృష్టికి వచ్చిందని, వెంటనే సంబంధిత సిబ్బందిని పంపించి విచారణ చేసి తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు. అనుమతి లేకుండా మట్టి తవ్వకాలు చేపడితే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు.

విద్యాభివృద్ధికి పెద్దపీట



తోటాడ హైస్కూల్లో జగనన్న విద్యాకానుక కిట్‌లు అందజేస్తున్న సర్పంచ్ మంగవేణి

మునగపాక : విద్యాభివృద్ధికి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేస్తున్నారని తోటాడ సర్పంచ్ దొడ్డి మంగవేణి పేర్కొన్నారు. తోటాడ హైస్కూల్‌లో మంగళవారం విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థుల సంక్షేమం కోసం ప్రభుత్వం పలు పథకాలు అమలు చేస్తుందన్నారు. నాడు–నేడు ద్వారా పాఠశాలల రూపురేఖలు మారుతున్నాయన్నారు. వైఎస్సార్‌సీపీ నేతలు దొడ్డి బాలాజీ, దొడ్డి కోటేశ్వరరావు, హెచ్‌ఎం కుమార్, పీఎంసీ చైర్మన్ భాస్కరరావు, వార్డు సభ్యుడు బొడ్డేడ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మినీ జాబ్ మేళాకు 198 మంది హాజరు

40 మంది ఉద్యోగాలకు ఎంపిక



ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న కంపెనీ ప్రతినిధులు

యలమంచిలి : ఆంధ్రప్రదేశ్ జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం యలమంచిలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మినీ జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో సీనప్టెక్స్ ల్యాబ్స్, ఎయిర్‌టెల్ బ్రాడ్ బాండ్ కంపెనీల ప్రతినిధులు నిర్వహించిన ఈ ఇంటర్వ్యూకు 198మంది నిరుద్యోగులు హజరవ్వగా 40 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారని నైపుణ్యాధికారి చాముడేశ్వరావు తెలిపారు.

తల్లిదండ్రుల సహకారం అవసరం



మాట్లాడుతున్న వర్మ

రాంబిల్లి : విద్యార్థుల బంగారు భవితకు తల్లిదండ్రులు సహకారం ఎంతో అవసరమని రాంబిల్లి ఉన్నత పాఠశాల తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ వర్మ అన్నారు. మంగళవారం ఈ పాఠశాలలో తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రయివేట్ పాఠశాలకు ధీటుగా జగనన్న ప్రభుత్వ బడులను తీర్చిదిద్దారన్నారు. అమ్మ ఒడి , విద్యాకానుక ఇతర పథకాలను సద్వినియోగం చేసుకొని పిల్లలను బాగా చదివించాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వేణుగోపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హైవేపై ప్రమాద నివారణకు చర్యలు

ఎస్.రాయవరం : ప్రమాద నివారణ చర్యలు తీసుకుంటున్నట్టు ఎస్‌ఐ ప్రసాద్ రావు తెలిపారు. కోనవానిపాలెం జంక్షన్ వద్ద జాతీయ రహదారిపై అనధికార డివైడర్‌కు రక్షణ కవచం మంగళవారం ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. హైవే విస్తరణ చేపట్టినప్పటికీ పలుకుబడితో ఇక్కడ బంకు యాజమాన్యం అనధికార డివైడర్ ఏర్పాటు చేశారు. అయితే ఈ డివైడర్ వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతూ పలువురు మృత్యువాత పడగా , మరికొందరు గాయాల పాలైపోయారు. ఇటీవల ఓ ఆటోడ్రైవర్ మృతి చెందడంతో ఎస్‌ఐ ప్రసాదరావు దృష్టి సారించారు. ఎట్టకేలకు రైలింగ్ వేయించి శాశ్వతంగా డివైడర్‌ను మూయించారు. దీంతో వాహన చోదకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మూలపేట గ్రామాభివృద్ధికి చర్యలు

మునగపాక : మూలపేట గ్రామాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతున్నామని సర్పంచ్ బీశెట్టి గంగప్పలనాయుడు అన్నారు. పంచాయతీ పరిధిలోని వాటర్ ట్యాంక్, రహదారికి ఇరువైపులా పేరుకుపోయిన తుప్పల తొలగింపు పనులను ఆయన మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మూలపేటలో పారిశుధ్యం, తాగునీరు, వీధి దీపాల నిర్వహణలో ప్రత్యేక దృష్టి సారిస్తున్నామన్నారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు ఆడారి సత్యనారాయణ, మొల్లేటి గోవిందరావు, కాంగ్రేగుల వరలక్ష్మి శ్రీనివాసరావు, సచివాలయ కన్వీనర్ ఆదికుమార్ పాల్గొన్నారు.

వర్షంతో ఊరట

రాంబిల్లి : మండలంలో మంగళవారం పలు గ్రామల్లో వర్షం పడింది. సుమారు 10 నిమిషాల పాటు భారీ వర్షం కురిసింది. దిమిలి, నారాయణపురం, కట్టుబోలు తదితర గ్రామాల్లో వర్షం నీరు రోడ్లపై ప్రవహించింది. నారుమడులు దుక్కి పనులకు ఈ వర్షం ఉపయోగపడుతుందని పలువురు రైతులు తెలిపారు. నైరుతి రుతుపవనాలు విస్తరించినప్పటికీ ఇంకా వర్షాలు ఆశించినంతగా పడడం లేదు. దీంతో రైతులు నిరాశగా ఉన్నారు. వర్షాలు పడితే వరి విత్తనాలు వేసేందుకు రైతులు సన్నద్ధంగా ఉన్నారు.

సచివాలయాలు ప్రారంభోత్సవానికి సిద్ధం



ప్రారంభోత్సవాలకు సిద్ధమవుతున్న మునగపాక-1,2 సచివాలయాలు

మునగపాక : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా బైపాస్ రోడ్డులో రూ.80 లక్షల వ్యయంతో భవన నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. అన్ని హంగులు పూర్తి చేసుకొని త్వరలో ఎమ్మెల్యే రమణమూర్తిరాజు చేతుల మీదుగా ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. మునగపాక -1, 2 భవన నిర్మాణాలకు సంబంధించి ఒక్కో భవనానికి రూ.40 లక్షలు కేటాయించారు. మునగపాకలో సచివాలయ భవన నిర్మాణాలు వేగవంతం చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు స్థానిక ప్రజా ప్రతినిధులు తగు చర్యలు చేపట్టారు.

పకడ్బందీగా జగనన్న సురక్ష సర్వే



డీఎల్‌పురం సచివాలయంలో మాట్లాడుతున్న అధికారులు

నక్కపల్లి : వచ్చే నెల నుంచి ప్రారంభం కానున్న జగనన్న సురక్ష కార్యక్రమానికి సంబంధించి గ్రామాల్లో జరుగుతున్న సర్వేను తహసీల్దార్ అంబేద్కర్, ఎంపీడీవో సీతారామరాజు మంగళవారం పరిశీలించారు. డీఎల్‌పురంలో వారు పర్యటించి ఇంటింటి సర్వేలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించి టోకెన్ జనరేషన్, సచివాలయాల్లో సర్వీసెస్ జనరేషన్ కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. అనంతరం సచివాలయంలో సిబ్బందితో మాట్లాడుతూ జూలై ఒకటో తేదీ వరకు వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, ఇంటింటికి తిరగాలన్నారు. వారి సమస్యలపై దరఖాస్తులు స్వీకరించి టోకెన్ జారీ చేసి గ్రామసభ తేదీని తెలియజేయాలన్నారు. గ్రామసభ నాడు దరఖాస్తు దారులను తీసుకు వచ్చే బాధ్యత వలంటీర్లదేనన్నారు. సమస్యలు తెలియజేసేందుకు ప్రభుత్వం రూపొందించిన నిర్ణీత ఫారంను వారికి అందజేయాలని, ఆన్‌లైన్‌లో కూడా అప్లోడ్ చేయాలని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కిల్లాడ రామకృష్ణ, ఎంపీటీసీ కోఆప్షన్ సభ్యుడు లొడగల చంద్రరావు, కార్యదర్శి నర్సింగరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రాంబిల్లి : మండలంలో పలు గ్రామాల్లో జగనన్న సురక్ష సర్వే చురుగ్గా సాగుతుంది. మంగళవారం పలు గ్రామాల్లో వలంటీర్లు సర్వే నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరిస్తున్నారు. ఏపీ ధ్రువీకరణ పత్రాలు కావాలో నమోదు చేస్తున్నారు. అలాగే సంక్షేమ పథకాలు పొందాలనుకునే వారి వివరాలు సేకరిస్తున్నారు. పంచాయతీ కార్యదర్శులు సర్వేను పరిశీలిస్తున్నారు.

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని నునపర్తి సచివాలయాన్ని ఎంపీడీవో విజయలక్ష్మి మంగళవారం సందర్శించారు. జగనన్న సురక్ష కార్యక్రమం అమలుకు సంబంధించి వలంటీర్ల సేవలు, టోకెన్ రిజిస్ట్రేషన్ తీరుపై ఆరా తీశారు. జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని ఆదేశించారు.సిబ్బంది తగిన సూచనలు ఇచ్చారు. అనంతరం రైతు భరోసా కేంద్రం, ఆరోగ్య కేంద్రం, జగనన్న హౌసింగ్ కాలనీలను సందర్శించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ చుక్కా అనురాధ, గొంప నర్సింహనాయుడు, పంచాయితీ కార్యదర్శి ఈశ్వరరావు, వీఆర్‌వో అనంతరావు పాల్గొన్నారు.

మునగపాక : ప్రజా సమస్యల పరిష్కారానికి జగనన్న సురక్ష దోహదపడుతుందని మెలిపాక సచివాలయ కన్వీనర్ గుంట్ల అప్పారావు అన్నారు. జగనన్న సురక్ష పథకంలో భాగంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వలంటీర్లు ఈ కార్యక్రమానికి ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలన్నారు. ఇంటింటికీ వెళ్లి సమస్యలు గుర్తించేలా సర్వే చేపట్టాలన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా చూడాలన్నారు. సమావేశంలో సర్పంచ్ అయినంపూడి విజయభాస్కరరాజు, ఎంఎల్‌వో సంజయ్, వైఎస్సార్‌సీపీనేత రామరాజు పాల్గొన్నారు.

బోదిగల్లం పాఠశాలలో తల్లిదండ్రుల సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న హెచ్‌ఎం

నక్కపల్లి : మండలంలో పెద బోదిగల్లం జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం తల్లిదండ్రుల సమావేశం జరిగింది. ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణ మాట్లాడుతూ అమ్మ ఒడి, జగనన్న విద్యాకానుక, రాగి జావ పంపిణీ, మధ్యాహ్న భోజన పథకం వంటి పథకాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. పాఠశాలలో విద్యాప్రమాణాలు పెంచడంతో పాటు, విద్యార్థుల సంఖ్యను పెంచాలని కోరారు. అమ్మ ఒడి అర్హుల జాబితా సచివాలయ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ వద్ద అందుబాటులో ఉందని, తమ పేర్లు సరి చూసుకుని దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈనెల 28న అమ్మఒడి నగదు తల్లుల ఖాతాల్లో జమ అవుతుందన్నారు. సమావేశంలో ఉపాధ్యాయులు ఆచార్యులు, కుమారి, ఫల్గుణరావు, రమేష్‌బాబు పేరెంట్స్ కమిటీ చైర్మన్ మహబూబున్నిషా, పెద్దలు మదీనావలి పాల్గొన్నారు.

తొలి ఏకాదశికి ఏర్పాట్లు



ఉపమాక వేంకటేశ్వరస్వామివారు

నక్కపల్లి : ప్రాచీన పుణ్యక్షేత్రం ఉపమాక వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 29న తొలి ఏకాదశికి తిరుమల తిరుపతి దేవస్థానం వారు ఏర్పాట్లు చేస్తున్నట్టు ప్రధానార్చకులు గొట్టు ముక్కల వరప్రసాద్ తెలిపారు. గరుడాద్రిపై వెలసిన మూలవిరాట్‌కు 29 గురువారం తెల్లవారు జామున నాలుగు గంటలకు ప్రత్యేక అభిషేకం నిర్వహిస్తామన్నారు. అనంతరం భక్తులందరికి దర్శనం కల్పిస్తామన్నారు. కొండ దిగువన ఆలయ క్షేత్ర పాలకుడు వేణుగోపాల స్వామి, స్వామివారి ఉత్సవమూర్తులు, ఆండాళ్లమ్మవారి సన్నిధిలో నిత్యార్చనలు అభిషేకాలు పూర్తి చేసి రాత్రి ఏడుగంటల వరకు దర్శనాలు కల్పిస్తామన్నారు. సాయంత్రం శ్రీనివాస భక్త సమాజం హరినామ సంకీర్తనలతో గిరి ప్రదక్షణ ఉత్సవం జరుగుతుందన్నారు.